సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 10 । ఆగస్టు । 2025

రక్షానుబంధం

మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుకు మహిళా నేతలు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కేకే రాజు అక్కచెల్లెమ్మలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, కరజాడ వెంకట నాగ శశికళ, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి వర్మ, నియోజకవర్గ అధ్యక్షురాలు శిరీష, నాయకులు భయవరపు రాధ, ఐ.పార్వతి, వరలక్ష్మి, సాకిణి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


కేకే రాజుకు రాఖీ కడుతున్న మహిళా నేతలు

ఆనందంగా .. రక్షాబంధన్

అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి శనివారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. నగరంలోని ప్రతి ఇంటా సందడి నెలకొనగా.. పలు చోట్ల సామాజిక సేవకులకు, అభిమాన నాయకులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని విభిన్న రూపాల్లో చాటుకున్నారు. ప్రతి ఏటా మాదిరిగానే చిన్నారుల నుంచి పెద్దల వరకు రాఖీ పండగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఈ పండగ కేవలం కుటుంబానికే పరిమితం కాకుండా సామాజిక బంధాలకు కూడా ప్రతీకగా నిలిచింది. ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషించే ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు మద్దిలపాలెం డిపో వద్ద ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రాఖీలు కట్టి తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు. నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ నిత్యం సేవలో ఉండే ట్రాఫిక్ పోలీస్‌కు జగదాంబ జంక్షన్‌లో ఓ యువతి రాఖీ కట్టి కృతజ్ఞతలు తెలిపారు. - మహారాణిపేట



మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద బస్సు డ్రైవర్లకు రాఖీలు కడుతున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు



జగదాంబ జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీస్‌కు రాఖీ కడుతున్న యువతి, సోదరుడికి రాఖీ కడుతున్న చిన్నారి


వేమన మందిరం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి రాఖీ కడుతున్న అభిమాని గొలగాని లక్ష్మి

అభిమానం.. అనుబంధం

ఆశీలమెట్టలోని వేమన మందిరం వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి గొలగాని లక్ష్మి అనే మహిళ రాఖీ కట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు. జీవీఎంసీ 27వ వార్డుకు చెందిన ఆమె.. వైఎస్సార్ మరణించినప్పటి నుంచి ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఆయన విగ్రహానికి రాఖీ కడుతుండటం విశేషం.

న్యూస్‌రీల్

గుజరాత్ హైకోర్టు జడ్జి విశాఖ పర్యటన

- నేడు ప్రముఖ న్యాయవాది సత్యనారాయణ చిత్రపటం ఆవిష్కరణ


సత్యనారాయణ (ఫైల్)

విశాఖ లీగల్: గుజరాత్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం విశాఖ చేరుకున్నారు. ఆయన ఆదివారం జిల్లా కోర్టును సందర్శించి, ప్రముఖ న్యాయవాది ఎం.సత్యనారాయణ(ఎం.ఎస్.ఎన్) చిత్రపటాన్ని ఆవిష్కరిస్తారు. పార్వతీపురంలో పేద చేనేత కుటుంబంలో జన్మించిన ఎం.సత్యనారాయణ.. చదువుపై ఆసక్తితో మైళ్ల దూరం నడిచి ప్రాథమిక, ఉన్నత విద్యను పూర్తి చేశారు. ఎంఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి, ఏయూ న్యాయ కళాశాల నుంచి న్యాయ పట్టా పొందారు. న్యాయవాదిగా 38 ఏళ్ల పాటు పేదలకు అండగా నిలిచారు. ముఖ్యంగా క్రిమినల్ కేసుల్లో నిష్ణాతులైన ఆయన, అనేక మంది యువ న్యాయవాదులకు స్ఫూర్తిగా నిలిచారు. 2022లో ఆయన మరణించారు. ఆదివారం ఉదయం న్యాయవాదుల సంఘ నూతన భవనంలో సత్యనారాయణ చిత్రపటాన్ని జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ఆవిష్కరిస్తారని సంఘ కార్యదర్శి ఎల్.పి.నాయుడు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె. శ్రీనివాస్ పాల్గొనున్నారు.

స్టీల్‌ప్లాంట్ సోలార్ ప్లాంట్ పునరుద్ధరణకు టెండర్లు



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో గత మూడేళ్లుగా నిలిచిపోయిన 5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను పునరుద్ధరించడానికి యాజమాన్యం టెండర్లు ఆహ్వానించింది. గతంలో ప్లాంట్ అంతర్గత అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయింది. దీని పునరుద్ధరణ కోసం ఈ నెల 5న నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 18లోగా టెండర్లు దాఖలు చేయవచ్చు. టెండర్ దక్కించుకున్న సంస్థ ఆరు నెలల్లోగా పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

- సిలిండర్ పేలుడు ఘటన బాధితులను పరామర్శించిన హోంమంత్రి


మృతుల కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న హోంమంత్రి అనిత, కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ ప్రాంతం బుక్కా వీధిలోని వెల్డింగ్ షాపులో ఇటీవల జరిగిన సిలిండర్ పేలుడు ఘటనలో మరణించిన ముగ్గురి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్.. ఫిషింగ్ హార్బర్, సున్నపు వీధిలోని మృతుల కుటుంబాలను శనివారం పరామర్శించి చెక్కులు అందజేశారు. ఈ ఘటనలో గాయపడి మెడికవర్‌లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని, నివేదిక వచ్చాక వివరాలు వెల్లడిస్తామని హోం మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా మత్స్యకారులకు అవగాహన కల్పిస్తామన్నారు.

ఎమ్మెల్యేలెవ్వరూ పట్టించుకోలేదు!

- మేయర్‌పై కార్పొరేటర్ల వ్యతిరేకత కూడా కారణమే..
- లోకేష్‌కు వివరించిన గండి బాబ్జీ
- కూటమిపై ప్రభావం పడిందన్న లోకేష్
- జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై గరంగరం
- రాష్ట్ర వ్యాప్తంగా కూటమిలో లుకలుకలున్నాయనే ప్రచారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు కూటమి పార్టీల్లో ఐక్యతను బట్టబయలు చేసేశాయి. కేవలం కూటమి పార్టీల మధ్య ఉన్న విభేదాలే కాకుండా పార్టీలోని అంతర్గత విభేదాలను సైతం ఈ ఎన్నికల ఫలితాలు బయటపెట్టాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై ఆ పార్టీ నేతలు దామచర్ల సత్య, పల్లా శ్రీనివాస్, గండి బాబ్జీ, పీలా శ్రీనివాస్‌లతో లోకేష్ టెలీ కాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల గురించి ఎందుకు పట్టించుకోలేదంటూ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్యపై లోకేష్ మండిపడినట్టు సమాచారం. మరోవైపు ఈ ఓటమితో రాష్ట్ర వ్యాప్తంగా కూటమిలోని పార్టీల మధ్య అభిప్రాయభేదాలు ప్రారంభమయ్యాయనే ప్రచారం జరుగుతోందంటూ పార్టీ నేతలతో లోకేష్ పేర్కొన్నట్టు తెలుస్తోంది. స్వయంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నియోజకవర్గంలోని అభ్యర్థి ఓడిపోవడంతో మరింతగా నష్టం వాటిల్లిందని కూడా మండిపడినట్టు ఆ పార్టీ నేతలే పేర్కొంటున్నారు. అయితే, పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఎవరూ స్టాండింగ్ కమిటీ ఎన్నికల గురించి పట్టించుకోలేదని లోకేష్‌కు గండి బాబ్జీ ఫిర్యాదు చేసినట్టు సమాచారం. మేయర్ వ్యవహారశైలిపై కూడా కార్పొరేటర్లు గరంగరంగా ఉండటమూ ఓటమికి కారణమయిందంటూ తేల్చిచెప్పినట్టు సమాచారం. అంతేకాకుండా కూటమిలోని జనసేన, బీజేపీలకు ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడంతో ఆయా పార్టీల కార్పొరేటర్లలో అసంతృప్తికి కారణమైందని కూడా అభిప్రాయపడ్డారు. మొత్తంగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు కూటమి పార్టీల మధ్య ఉన్న లుకలుకలను.. మేయర్‌పై ఉన్న వ్యతిరేకతను.. ఎమ్మెల్యేలకు కేవలం సంపాదన మీద మాత్రమే ఉన్న దృష్టితో పాటు అంతిమంగా వైఎస్సార్‌సీపీపై వెల్లువెత్తుతున్న ప్రజాభిమానాన్ని ఒకేసారి తేటతెల్లం చేసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఫ్లోర్ లీడర్ మార్పు కూడా..!

సరిగ్గా స్టాండింగ్ కమిటీ ఎన్నికల ముందు జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ మార్పుపై ఎమ్మెల్యే వంశీకృష్ణ చర్చకు తేవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫ్లోర్ లీడర్ మార్చాలంటూ ఆ పార్టీలో చేరిన కార్పొరేటర్లు కోరుతూ వంశీకి లేఖ సమర్పించడం కూడా విభేదాలకు కారణమైంది. ప్రస్తుత ఫ్లోర్ లీడర్ భర్త అమాంతంగా నాగబాబుతో వాగ్వాదానికి దిగారనే కారణంగా దించేందుకు సిద్ధపడటం ఏమిటంటూ ఆ పార్టీకి చెందిన నేతలు మండిపడుతున్నారు. అంతేకాకుండా కనీసం తమ పార్టీకి ఒక్క సీటు కూడా లేని స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో తామేందుకు ఓటేయాలని.. ఎవరి జెండానే ఎన్ని రోజులు మోయాలంటూ కొందరు ఓటింగుకు దూరంగా ఉండగా.. వెళ్లిన ఇతరులు కూడా మొండిచేయి చూపినట్టు తెలుస్తోంది. తద్వారా కూటమి పార్టీల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు ఈ స్టాండింగ్ కమిటీ ఎన్నికల ద్వారా ప్రస్ఫుటంగా వ్యక్తమైనట్టు తెలుస్తోంది.



క్రాస్ ఓటింగ్ వేసిందెవరు..!

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఏయే కార్పొరేటర్లు క్రాస్ ఓటింగు వేశారనే వివరాలను తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఎందుకు దూరమయ్యారనే వివరాలను వారి ద్వారానే తెలుసుకుని పరిష్కరించుకోవాలంటూ మేయర్‌ను ఆదేశించినట్టు తెలుస్తోంది. ప్రధానంగా మేయర్ వ్యవహారశైలితో దూరంగా ఉన్న కార్పొరేటర్లను బుజ్జగించే బాధ్యత కూడా ఆయనకే అప్పగించినట్టు సమాచారం. ఇది కాస్తా మేయర్‌కు మింగుడుపడటం లేదని ఆ పార్టీ నేతలే పేర్కొంటున్నారు. ఇటీవల పెందుర్తిలో జరిగిన పార్టీ సమావేశంలో గండి బాబ్జీ, మేయర్ పరస్పరం బహిరంగంగానే విమర్శలు చేసుకున్నారు. ఈ గొడవను మనసులో పెట్టుకున్న గండి బాబ్జీ... సమయం కోసం ఎదురుచూసి ఇప్పుడు లోకేష్ ముందు తనను ఇరకాటంలో పడేశారంటూ మేయర్ ఆవేదన చెందుతున్నట్టు సమాచారం. అంతేకాకుండా జీవీఎంసీలో పార్టీ ఫ్లోర్ లీడర్‌ను ప్రకటించేందుకు కూడా మేయర్ అడ్డుపడుతున్నారనే విషయాన్ని కూడా పరోక్షంగా ప్రస్తావించినట్టు తెలుస్తోంది. పార్టీ ఫ్లోర్ లీడర్‌గా గంధం శ్రీనుకు ఇస్తామంటూ ఆశ చూపి... ఇప్పటివరకు మేయర్ కనీసం పట్టించుకోకపోవడం కూడా నష్టం చేకూర్చిందంటూ పార్టీలో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఫ్లోర్ లీడర్‌ను ప్రకటించి ఉంటే పార్టీకి చెందిన కార్పొరేటర్లను సమన్వయం చేసుకునే అవకాశం ఉండేదనే వాదన కూడా తెరమీదకు వచ్చింది.

13న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సమావేశం


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మహారాణిపేట:

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 13న జిల్లా కార్యాలయంలో ఎస్సీ విభాగం విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బోని శివ రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఎస్సీ విభాగ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కేకే రాజు కోరారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, రాష్ట్ర ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు పూర్ణ చంద్రరావు, కార్పొరేటర్లు రెయ్యి వెంకట రమణ, కరజాడ వెంకట నాగ శశికళ, జోనల్ విభాగం అధ్యక్షులు అల్లంపల్లి రాజబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మంచా నాగ మల్లేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షులు కోన శంకర్, నియోజకవర్గ అధ్యక్షులు పూడి మల్లేష్, భవానీశంకర్, లక్ష్మణ్, పార్టీ ముఖ్య నాయకులు కటికల కల్పన, విక్టర్, ఎస్.మురళి, తారకేష్, సాయి రాజు, సత్యనారాయణ, గణేష్, సాలమాన్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులుగా నో క్లాస్

- ఏయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో అటకెక్కిన తరగతులు
- కాలేజీలో 55 ఫ్యాకల్టీలకు గాను ఉన్నది 14 మందే..
- గెస్ట్ ఫ్యాకల్టీ కూడా లేకపోవడంతో విద్యార్థుల చదువులపై నీలినీడలు



విశాఖ సిటీ: ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిష్ట నానాటికీ దిగజారిపోతోంది. గత ఐదేళ్లలో దేశంలోనే టాప్–3 యూనివర్సిటీలలో ఒకటిగా పరిఢవిల్లిన విద్యాలయం ఇప్పుడు ఆ వైభవాన్ని కోల్పోతోంది. విద్యార్థులకు పురుగుల భోజనాలు.. హాస్టళ్లలో సక్రమంగా లేని వసతులు.. స్కాలర్‌షిప్‌లు రాకపోకపోయినా ఫీజుల మోతలు.. ఇలాంటి పరిస్థితులపై ఏయూ అప్రతిష్టను మూటగట్టుకుంటోంది. తాజాగా విద్యా బోధన కూడా అటకెక్కుతోందన్న వార్తలు మరింత ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ప్రధానంగా ఏయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో ఫ్యాకల్టీల కొరత వేధిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా తరగతులు సక్రమంగా జరగడం లేదన్న టాక్ వినిపిస్తోంది.

55 మందికి కేవలం ఉన్నది 14 మందే..

ఉన్నతమైన, సృజనాత్మకమైన విద్యా బోధనకు పెట్టింది పేరు ఆంధ్ర విశ్వవిద్యాలయం. 'తేజస్వినావధీతమస్తు' అనే ఆశయంతో ఏటా వేలాది మంది విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దుతోంది. దేశంలోనే అత్యున్నత వర్సిటీల్లో ఒకటిగా నిలిచింది. అత్యున్నత వసతులు, ప్రమాణాలతో విద్యను అందిస్తూ నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్(నాక్)ను సైతం మెప్పించి 'ఏ డబుల్ ప్లస్' గ్రేడ్‌ను పొందింది. అటువంటి ఘన చరిత్ర కలిగిన, శతాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్న ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇప్పుడు ఫ్యాకల్టీల కొరత పట్టి పీడిస్తోంది. విద్యార్థులకు సొకర్యాలు తీసికట్టుగా మారుతున్నాయి. విద్యార్థులకు సరైన బోధన అందించేందుకు ఫ్యాకల్టీలు లేక తరగతులు అటకెక్కుతున్నాయి. ప్రధానంగా మహిళా ఇంజనీరింగ్ కాలేజీ పరిస్థితి మరింత దారుణంగా మారింది. కాలేజీలో మొత్తంగా 55 మంది ఫ్యాకల్టీల అవసరం ఉంది. కానీ ప్రస్తుతం కేవలం 14 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో కూడా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారే ఉండడం విశేషం. అప్పుడప్పుడు కొంత మంది ఫ్యాకల్టీలను మహిళా కాలేజీకి పంపించి తరగతులు నిర్వహిస్తున్నారు. అంతేకాని ఇప్పటి వరకు పూర్తి స్థాయి ఫ్యాకల్టీలను మహిళా ఇంజనీరింగ్ కాలేజీకి నియమించకపోవడం గమనార్హం.

'అతిథులు' లేకపోవడంతో మరింత ఇబ్బంది..

పూర్తి స్థాయి ఫ్యాకల్టీ లేనప్పటికీ.. కొద్ది నెలల క్రితం వరకు గెస్ట్ ఫ్యాకల్టీతో తరగతులను నెట్టుకొచ్చారు. కానీ ప్రస్తుతం అతిథి అధ్యాపకులను తొలగించారు. కొత్తగా వారిని నియమించేందుకు కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడుతున్నారు. మ్యాథమెటిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు ఒక్కోదానికి 10 మంది అతిథి అధ్యాపకులను తీసుకోవాలని భావించారు. అయితే ఆ సంఖ్యలో అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు రాకపోవడం గమనార్హం. అలాగే మిగిలిన డిపార్ట్‌మెంట్లకు కూడా ఆశించిన స్థాయిలో అభ్యర్థులు హాజరు కాలేదు. దీంతో ముమ్ముందు కూడా గెస్ట్ ఫ్యాకల్టీలు కూడా పూర్తి స్థాయిలో ఉండే అవకాశం లేదు. ఫలితంగా మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో తరగతులు ఎలా నిర్వహిస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికే గత నెల రోజులుగా తరగతులు సక్రమంగా జరగడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికీ ఫ్యాకల్టీలను నియమించని పక్షంలో తమ చదువులెలా సాగుతాయని వారు ఆందోళన చెందుతున్నారు.

క్రమశిక్షణతోనే వృత్తిలో రాణింపు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు


జస్టిస్ లక్ష్మణరావును సత్కరిస్తున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు, ఆలపాటి గిరిధర్

సబ్బవరం: క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యం దిశగా కృషి చేసినప్పుడే ఎంచుకున్న వృత్తిలోనైనా, చదువులోనైనా రాణించగలరని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన మూడు, ఐదేళ్ల కోర్సుల విద్యార్థులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'న్యాయ విద్య– సమకాలీన పరిస్థితుల్లో దాని ఆవశ్యకత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. గురువులను పూజిస్తూ, క్రమశిక్షణతో ముందున్న లక్ష్యాలను చేరుకోవడానికి దీక్షతో కృషి చేయాలన్నారు. సత్యం, ధర్మం ప్రాముఖ్యతను మహాభారతంలోని ఉదాహరణలతో వివరించారు. సత్యాన్ని అనుసరించాల్సిన ప్రాముఖ్యతను మహాత్మా గాంధీ అనేక సందర్భాలలో తెలియజేశారని, ఆయన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. తాము చదువుకునే రోజుల్లో జాతీయ విశ్వవిద్యాలయాలు లేవని.. చిన్న చిన్న న్యాయ కళాశాలల్లో చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నామన్నారు. నేటి తరానికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు, వ్యాట్ ట్రిబ్యునల్ చైర్మన్ ఆలపాటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణరావును వర్సిటీ తరఫున ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు సామాజిక దృక్పథం అవసరం
- బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సత్యనారాయణ
8లో

అప్పన్న ఆభరణాల తనిఖీలు ప్రారంభం


వస్తువులు, రికార్డులను తనిఖీ చేస్తున్న కమిటీ సభ్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి చెందిన బంగారు, వెండి, ఇతర విలువైన వస్తువులు, ఆభరణాల తనిఖీలను దేవదాయశాఖ, రాజమహేంద్రవరం ఆర్‌జేసీ ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ శనివారం ప్రారంభించింది. ఈ తనిఖీలు మరో రెండు రోజులపాటు కొనసాగనున్నాయి. కడప జిల్లాకు చెందిన కె.ప్రభాకరాచారి గతేడాది ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ తనిఖీలు జరుగుతున్నాయి. రికార్డుల్లో పేర్కొన్న వివరాలకు, వాస్తవంగా ఉన్న ఆభరణాలకు తేడాలు ఉన్నాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై దేవదాయశాఖ జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు ఈ ఏడాది జనవరి 17 నుంచి నెలరోజుల పాటు రికార్డులను పరిశీలించి నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా మరింత లోతుగా తనిఖీలు చేసేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన ఒక కమిటీని నియమించారు. ఆ తర్వాత ఆ విషయం మరుగున పడింది. ప్రస్తుతం రాజమండ్రి ఆర్‌జేసీగా కూడా విధులు నిర్వహిస్తున్న సింహాచలం ఇన్‌చార్జి ఈవో త్రినాథరావు చొరవతో ఈ తనిఖీలు మళ్లీ మొదలయ్యాయి. శనివారం ఉదయం 11 గంటలకు ఆలయానికి చేరుకున్న కమిటీ సభ్యులు.. ముందుగా బండాగారంలోని ఆభరణాలు, వస్తువులను వాటి రికార్డులతో సరిపోల్చి బరువులు తనిఖీ చేశారు. ఈ కమిటీలో విజయనగరం డిప్యూటీ కమిషనర్ కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు, అంతర్వేది ఈవో ఎం.కె.టి.ఎన్.ప్రసాద్, తూర్పుగోదావరి డిప్యూటీ ఈవో ఇ.వి.సుబ్బారావు, ఆర్‌జేసీ కార్యాలయం సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం ఉన్నారు. ఈ తనిఖీలు పారదర్శకంగా జరుగుతున్నాయని, పూర్తి నివేదికను సమర్పిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. రాబోయే రోజుల్లో అర్చకుల ఆధీనంలో ఉన్న వస్తువులు, మ్యూజియం, బ్యాంకుల్లో ఉన్న వస్తువులను కూడా పరిశీలిస్తామని వారు పేర్కొన్నారు.

ఉత్సాహంగా పారా అథ్లెటిక్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: నగరంలోని పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్స్‌లో అంతర్ జిల్లాల పారా అథ్లెటిక్ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో జూనియర్ (19 ఏళ్లలోపు), సబ్–జూనియర్ (17 ఏళ్లలోపు) ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పి.వి.జి.ఆర్.నాయుడు ఈ పోటీలను ప్రారంభించి.. పాల్గొన్న అథ్లెట్లను అభినందించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ట్రాక్, ఫీల్డ్ విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. టీ11–13 అంశాల పరుగు విభాగంలో ట్రాక్‌లో పరుగులందుకుని తగ్గేదేలే అంటూ పోటీపడ్డారు. ముఖ్యంగా వినికిడి లోపం ఉన్నవారు, మేధోపరమైన సవాళ్లు ఎదుర్కొంటున్న పిల్లలు కూడా ఈ పోటీల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన అథ్లెట్లు హర్యానాలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే అంతర్ రాష్ట్ర పారా అథ్లెటిక్ మీట్‌కు రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

పలు రైళ్లకు ఆయా స్టేషన్లలో హాల్ట్‌లు

తాటిచెట్లపాలెం: ఆయా ప్రాంతాల ప్రయాణికులు, ప్రజల అవసరాలకు తగినట్లుగా పలు రైళ్లకు ప్రయోగాత్మకంగా హాల్ట్‌లను ఇచ్చేందుకు రైల్వే బోర్డు నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–కోర్బా–విశాఖపట్నం (18518/18517) ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి ఇరువైపులా మురిబహల్ స్టేషన్లో హాల్ట్ కల్పించారు.
- ధన్‌బాద్–అలెప్పీ–ధన్‌బాద్(13351/13352) బొకారో ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి ఇరువైపులా అంబోడల, తెరుబలి స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు.
- బిలాస్‌పూర్–తిరుపతి–బిలాస్‌పూర్(17481/17482) ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి ఇరువైపులా అంబోడల, తెరుబలి స్టేషన్‌ల్లో హాల్ట్ కల్పిస్తున్నారు.
- హజరత్ నిజాముద్దీన్–విశాఖపట్నం(12808) సమతా ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి, తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం–హజరత్ నిజాముద్దీన్(12807) సమతా ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 16వ తేదీ నుంచి తెరుబలి స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు.
- అమృతసర్–విశాఖపట్నం–అమృతసర్(20808/20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి ఇరువైపులా నరాజ్ మార్తాపూర్ స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు.

విద్యార్థులకు సామాజిక దృక్పథం అవసరం

- బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సత్యనారాయణ



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: విద్యార్థులకు జ్ఞానంతో పాటు సామాజిక బాధ్యత, విలువల పెంపొందించడంలో గురుకులాల పాత్ర కీలకమని బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సత్యనారాయణ అన్నారు. విద్య ఒక్కటే వారి భవిష్యత్‌కు కొలమానం కాకూడదని ఆయన సూచించారు. ఆ దిశగా ప్రభుత్వ ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు యువతను ప్రోత్సహించాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జోన్–1 జిల్లాల అధికారులు, ప్రిన్సిపాళ్లు, వార్డెన్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక విలువలు తగ్గుముఖం పట్టడం వల్ల యువతలో నేర ప్రవృత్తి, బాధ్యతారాహిత్యం, ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు బీసీ సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లలో అవగాహన పెంచేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదువుతో పాటు సామాజిక దృక్పథం పెంచడం వల్ల విద్యార్థుల్లో విలువలతో కూడిన జీవితం అలవడుతుందన్నారు. ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు రెసిడెన్షియల్ విద్యార్థులను తమ సొంత పిల్లల్లాగా చూసుకోవాలని, రోజంతా వారితో మమేకం కావాలని సూచించారు. బయటి సమాజంతో పోలిస్తే రెసిడెన్షియల్ విద్యార్థుల అభివృద్ధిలో సవాళ్లు ఎక్కువ, సౌకర్యాలు తక్కువ ఉన్న మాట వాస్తవమే అయినా.. ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు తమ విధులను పూర్తి స్థాయిలో నిర్వర్తిస్తే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును అందించవచ్చన్నారు. అవసరమైన మేరకు సీఎస్సార్ నిధులను కూడా సేకరించుకోవచ్చన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు మాట్లాడుతూ యువతకు చదువు ప్రాముఖ్యత, అవకాశాలు, లక్ష్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, మానసిక నిపుణుడు ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ వసతిగృహాలు, కళాశాలల్లో కల్పించే ప్రశాంతమైన వాతావరణమే విద్యార్థుల మంచి భవిష్యత్‌కు బాటలు వేస్తుందన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ బీసీ రెసిడెన్షియల్ వసతిగృహాల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 77శాతంగా ఉందని, ఇందులో 17శాతం మంది ఫస్ట్ క్లాస్ సాధించినట్లు తెలిపారు. ఈ శాతాన్ని మరింత పెంచడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పి.మాధవీలత, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి పార్వతీపురం–సీతానగరం– బొబ్బిలి–డొంకినవలస సెక్షన్‌ల్లో జరుగుతున్న మూడో లైన్ సంబంధిత భద్రతా పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు

విశాఖపట్నం–రాయ్‌పూర్(58528) పాసింజర్ ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు, రాయ్‌పూర్–విశాఖపట్నం(58527) పాసింజర్ ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు, విశాఖపట్నం–కోరాపుట్(58537) పాసింజర్ ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు, కోరాపుట్–విశాఖపట్నం(58537) పాసింజర్ ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు, విశాఖపట్నం–భవానిపట్న(58504) పాసింజర్ ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు, భవానిపట్న–విశాఖపట్నం(58503) పాసింజర్ ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు రద్దయ్యాయి.

గమ్యం కుదించిన రైళ్లు

ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు గుంటూరు–రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు రాయగడ–గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్ రాయగడ నుంచి కాకుండా విజయనగరం నుంచి బయల్దేరుతుంది.

సమయం మార్చిన రైళ్లు

- దుర్గ్‌లో ఉదయం 5.45 గంటలకు బయల్దేరాల్సిన దుర్గ్–విశాఖపట్నం (20829) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు 3 గంటలు ఆలస్యంగా ఉదయం 8.45 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఇదే తేదీల్లో విశాఖపట్నంలో మధ్యాహ్నం 2.50గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–దుర్గ్ (20830) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 2.30 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.20 గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది.
- ఈ నెల 24, 26వ తేదీల్లో నాందేడ్‌లో సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరాల్సిన నాందేడ్–సంబల్‌పూర్(20810) నాగావళి ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 20, 21, 23, 24, 26వ తేదీల్లో విశాఖపట్నంలో ఉదయం 9.20 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–నిజాముద్దీన్(12807) సమతా ఎక్స్‌ప్రెస్ 5 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరుతుంది.

44 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

మహారాణిపేట: వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్న పలు సంస్థలపై సివిల్ సప్లయీస్ అధికారులు శనివారం మెరుపుదాడులు చేశారు. ఆయా సంస్థలు మొత్తం 44 గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లు ఉపయోగిస్తున్నట్టు సివిల్ సప్లయీస్ అధికారులు గుర్తించినట్టు డీఎస్‌వో భాస్కర్ తెలిపారు. అన్ని సిలిండర్లను ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ 1955లోని సెక్షన్ 6ఎ కింద స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్టు వివరించారు.

సన్ షైనర్స్ ఘన విజయం

- అశ్విన్, అవినాష్ సెంచరీలు మిస్
- ఉత్కంఠగా ఏపీఎల్



బంతిని బౌండరీకి తరలిస్తున్న అవినాష్



విజయం సాధించిన విజయవాడ సన్‌షైనర్స్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) నాలుగో సీజన్‌లో భాగంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో విజయవాడ సన్ షైనర్స్.. రాయలసీమ రాయల్స్‌పై ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రెండు జట్ల నుంచి ఆటగాళ్లు అశ్విన్ హెబ్బర్, అవినాష్ సెంచరీలు చేసే అవకాశాలను త్రుటిలో కోల్పోయారు. సన్ షైనర్స్ టాస్ గెలిచి లక్ష్య ఛేదనకు మొగ్గు చూపడంతో రాయలసీమ రాయల్స్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఓపెనర్లు విఫలమైనప్పటికీ.. అవినాష్ (96 పరుగులు) అద్భుతంగా ఆడి జట్టు స్కోరును పెంచాడు. అతను 39 బంతుల్లో 4 ఫోర్లు, 11 సిక్సర్లతో విధ్వంసం సృష్టించాడు. సెంచరీకి కేవలం నాలుగు పరుగుల దూరంలో అవుటవ్వడం అభిమానులను నిరాశపరిచింది. గిరినాథ్ 49 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. విజయవాడ బౌలర్లలో లలిత్ మోహన్, రాజు రెండేసి వికెట్లు పడగొట్టారు. 197 పరుగుల లక్ష్య ఛేదనలో విజయవాడ సన్ షైనర్స్ కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ (98 పరుగులు) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టుకు విజయాన్ని అందించాడు. 6 ఫోర్లు, 9 సిక్సర్లతో అశ్విన్ సెంచరీకి చేరువలో అవుటయ్యాడు. అతనితో పాటు తేజ(77 పరుగులు) కూడా దూకుడుగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. సన్ షైనర్స్ 16.5 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. రాయలసీమ బౌలర్ సాకేత్ మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు.

వారియర్స్ జోరు.. లయన్స్ బేజారు

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాలుగో సీజన్‌లో తుంగభద్ర వారియర్స్ బోణీ కొట్టింది. వైఎస్సార్ రాజశేఖర రెడ్డి స్టేడియంలో శనివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన మ్యాచ్‌లో సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై 7 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. కెప్టెన్ మహీప్ కుమార్ (57) అర్ధశతకంతో జట్టును ముందుండి నడిపించగా, బౌలర్లు సమష్టిగా రాణించి లయన్స్ పతనాన్ని శాసించారు. అంతకుముందు, టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన సింహాద్రి వైజాగ్ లయన్స్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి కేవలం 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ అభిషేక్ (40) ఒంటరి పోరాటం చేసినప్పటికీ, అతనికి మరో ఎండ్ నుంచి సరైన సహకారం లభించలేదు. జట్టు 48 పరుగులకే కీలకమైన ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ రికీ భుయ్ (2) సహా బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. సందీప్ (11), చివర్లో ధీరజ్ లక్ష్మణ్ (22) మాత్రమే రెండంకెల స్కోరును దాటగలిగారు. వారియర్స్ బౌలర్లలో మీడియం పేసర్ తోషిత్ మూడు, సిద్ధార్థ్, స్టీఫెన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. 110 పరుగుల లక్ష్య ఛేదనలో తుంగభద్ర వారియర్స్‌కు కూడా ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ శ్రీ సామాన్య (3) త్వరగానే వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ మహీప్ కుమార్‌తో జతకట్టిన మరో ఓపెనర్ జ్ఞానేశ్వర్ (40) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ పవర్‌ప్లేలోనే స్కోరు బోర్డును 62 పరుగులకు చేర్చి మ్యాచ్‌పై పట్టు సాధించారు. కెప్టెన్ మహీప్ కుమార్ 57 పరుగులతో అద్భుత అర్ధశతకాన్ని నమోదు చేశాడు. దీంతో తుంగభద్ర వారియర్స్ 12.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసి విజయం సాధించింది.

ఉత్సాహంగా వీఎంఆర్‌డీఏ క్రీడోత్సవం



పోటీల్లో పాల్గొంటున్న సిబ్బందితో అతిథులు

విశాఖ స్పోర్ట్స్: వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడోత్సవాన్ని శనివారం పోర్ట్ స్టేడియంలో నిర్వహించారు. క్రికెట్, ఇండోర్ గేమ్స్‌లో సంస్థ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. పోటీల ప్రారంభ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పివిజిఆర్ నాయుడు, వెలగపూడి రామకృష్ణ, వంశీకృష్ణ, విశ్వనాథ్ క్లబ్ అధినేత కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. సంస్థ చైర్మన్, కమిషనర్‌తో సిబ్బంది ఒక జట్టుగా.. ప్రజాప్రతినిధులు జట్టుగా తాడు గుంజాట జరిగింది. ఇరుజట్లు ఉత్సాహంగా పాల్గొనగా వీఎంఆర్‌డీఏ జట్టు విజయం సాధించింది.

ఘనంగా సెంట్రల్ బ్యాంక్ వార్షికోత్సవం



ఖానావాలా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రాంతీయ మేనేజర్ ఏవీఆర్ మూర్తి, సిబ్బంది

డాబాగార్డెన్స్: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 144వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ద్వారకానగర్‌లోని ఆ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ వ్యవస్థాపకుడు సర్ సోరాబ్జీ పోచ్ ఖానా వాలా చిత్రపటానికి ప్రాంతీయ మేనేజర్ ఎ.వి.ఆర్.మూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎ.వి.ఆర్.మూర్తి.. దేశంలోనే తొలి స్వదేశీ బ్యాంకును స్థాపించిన ఖానావాలా జీవిత పాఠాలను, ఆయన నిబద్ధతను, విలువలను సిబ్బందికి వివరించారు. ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మరణించి మరో ఇద్దరికి వెలుగునిచ్చి..



మరణించిన అచ్చియ్యమ్మ కళ్లు తీసుకునేందుకు అంగీకారం తెలుపుతున్న కుటుంబ సభ్యులు

పెందుర్తి : అనారోగ్యంతో మరణించిన వృద్ధురాలి నేత్రాలు దానం చేసి మానవత్వం చాటుకుంది ఓ కుటుంబం. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం తాడివానిపాలెం అంబేడ్కర్‌కాలనీకి చెందిన రాజాన అచ్చియ్యమ్మ(90) ఆరోగ్యం క్షీణించి శనివారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్, స్థానిక పెద్ద ఎం.సింహాచలం మృతురాలి కుటుంబ సభ్యులను నేత్రదానానికి ఒప్పించారు. కుటుంబ సభ్యులు అంగీకారం తెలపడంతో వెంటనే అక్కడకు చేరుకున్న ఎల్వీ ప్రసాద్ సారథ్యంలోని మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు అచ్చియ్యమ్మ నేత్రాలను సేకరించి సురక్షితంగా ఆసుపత్రికి తరలించారు.